## కోవూరు చక్కెర ఫ్యాక్టరీ అక్రమ అమ్మకంపై చర్చా వేదిక

# ఎలుకలు పడ్డాయని ఇల్లు తగల బెడతారా?

కోవూరు చక్కెర ఫ్యాక్టరీకి ఒక ప్రత్యేకత వుంది. ఫ్యాక్టరీకి కేవలం పదిహేను, ఇరవై కిలోమీటర్ల పరిధిలోని మొత్తం వుత్పత్తికి అవసరమైన చెరకు పండుతున్నది; ఈ పొలాలన్నింటికి పుష్కలమైన నీటి వసతి వుంది; రైతులు కూడా అభ్యుదయ దృక్పథం కల్గిన వారు; దానితో ఆధునిక సాగు పద్ధతులు పాటించి నాణ్యమైన చెరకు ఉత్పత్తి చేస్తున్నారు. ఇన్ని సౌలభ్యాలు కల్గిన ఫ్యాక్టరీ ఆంధ్ర దేశంలో మరొకటి లేదనడం నిజం.

ప్రారంభ దశలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్న మాట వాస్తవమైనప్పటికి, ఆ తర్వాత ఫ్యాక్టరీ వున్నత స్థితికి ఎదిగింది. 1994లో ఫ్యాక్టరీ మీద తెచ్చిన అప్పులన్నీ తీరి పోయాయి. సహకార రంగంలోని పరిశ్రమ ఋణ విముక్తం కావడం అరుదైన విశేషమని ఎవరైనా ఒప్పుకుంటారు. దానితో ఒక్కొక్క వాటా విలువ 100 నుంచి 1400 రూపాయలకు పెరిగింది. సహకార రంగంలో ఇది కూడా ఒక రికార్డు. మరొక పక్క జాతీయ స్థాయిలో పలు అవార్డులు లభించాయి. రైతు ప్రతినిధుల కష్టం వల్ల కల్గిన ప్రయోజనాలు ఇవి.

కానీ ఆ తర్వాత ప్రభుత్వం ఫ్యాక్టరీకి ఎన్నికలు జరపకుండా, అధికారుల పరం చేసింది. ఆ పుణ్యాత్ములు ఫ్యాక్టరీ ఖజానాను పందికొక్కుల వలె మేశారు. చీడపురుగుల వలె నమిలి పారేశారు. తిరిగి ఎన్నికలు జరిగి రైతు ప్రతినిధులు పగ్గాలు చేపట్టేసరికి మిగిలింది - శిథిల గృహం మాత్రమే.

సహకార రంగంలోని చక్కెర పరిశ్రమలు నష్టాలలో కూరుక పోవడానికి కారకులెవరు? కారణం ఏమిటి అన్నది అర్థం చేసుకోవడానికి మన ఫ్యాక్టరీ అనుభవమే చాలు. ప్రభుత్వ నిర్వహణలో పనిచేసే అధికారుల అసమర్థత, అవినీతి ఫలితంగా ఈ పరిశ్రమలు దివాలా తీసిన నిజం కప్పిపెట్టి; అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం మరచి; లోపాలు సరిదిద్ద వలసిన బాధ్యత విస్మరించి - ఫ్యాక్టరీ నష్టాలలో వుంది కాబట్టి అమ్మి పారేస్తామని చెప్పడానికి ప్రభుత్వానికి నోరెట్లా వస్తున్నది? పేరుకు సహకార రంగమనే కాని, ఫ్యాక్టరీ మీద ఎప్పుడూ పెత్తనం అధికారులదే; అంతా వాళ్ల ఇష్టారాజ్యమే. అటువంటప్పుడు సహకార రంగమే విఫలమైందని తేల్చి చెప్పడం అన్యాయం కాదా? సహకార రంగంలోని పరిశ్రమలను సహకార స్ఫూర్తితో ఎప్పుడు నడవనిచ్చింది ప్రభుత్వం?

ఆ సంగతి ప్రక్కనపెట్టి, మన ఫ్యాక్టరీ విషయానికి వస్తే- ఇది సహకార రంగంలో నిర్మించబడినప్పటికీ, ఫ్యాక్టరీకి ప్రభుత్వం ఒక్కటే యజమాని కాదు. అందులో రైతుల కష్టార్జితం కూడా వాటా రూపంలో వుంది. వారికి సగభాగం వుంది. వాటాదారులైన రైతులతో మాట మాత్రం చెప్పకుండా, అనుమతి తీసుకోకుండా ప్రభుత్వం ఏక పక్షంగా నిర్ణయం తీసుకోవడం దారుణమైన నిరంకుశ పోకడ.

నెల్లూరు, కోవూరు తాలూకాల రైతాంగానికి ఆయువు పట్టువంటి ఈ ఫ్యాక్టరీ బాగోగుల గురించి ఏనాడూ ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులను అడ్డం పెట్టుకుని తమ స్వార్థ అవసరాలు తీర్చుకున్నవారు తప్ప, ఫ్యాక్టరీ మంచి చెడ్డలు చూసినవారు లేరు. అందువల్ల నెల్లూరు జిల్లాలోని ఏ ప్రజా ప్రతినిధికీ కూడా ఫ్యాక్టరీపై వుపన్యాసాలు దంచే అర్హత లేదు. అధికారుల అవినీతి దాహం, అసమర్థపాలన, నేతల రాజకీయ స్వార్థం, ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలకు ఫ్యాక్టరీ బలి పశువుగా మారింది. ఇంట్లో ఎలుకలు పడితే ఇల్లు తగలబెట్టినట్లు, నష్టాల సాకు చూపించి ఫ్యాక్టరీని అమ్మి పారేయాలని చూస్తున్నారు. ఈ అన్యాయాన్ని, దుర్మార్గాన్ని ప్రతిఘటించ వలసిన అవసరం ఈ రెండు తాలూకాలలోని ప్రతి రైతు మీదా వుంది.

వి. నిరంజన రెడ్డి,
మాజీ డైరక్టర్,
కోవూరు చక్కెర ఫ్యాక్టరి
చెర్లోపాళెం.

ప్రైవేట్ యాజమాన్యంలోకి వెళ్తే రైతులు నరకం చవిచూడవల్సి వస్తుంది

కోవూరు చక్కెర ఫ్యాక్టరీ ప్రైవేటు యాజమాన్యంలోకి వెళ్తే దాని దుష్పరిణామాలు జిల్లా రైతాంగం అంతటి మీదా వుంటుంది. సహకార రంగంలో నడిచే ఈ ఫ్యాక్టరీ సక్రమంగా వుంది కాబట్టి జిల్లాలోని తతిమా ప్రైవేటు ఫ్యాక్టరీ యాజమాన్యాలు తోక ఆడించడం లేదు. ఇది చేతులు మారిందంటే అందరూ కల్సి సిండికేట్‌గా ఏర్పడి ధరల విషయంలో, సౌకర్యాల విషయంలో, చెరకు సాగు విషయంలో రైతులను ఉడకాడించడం ఖాయం. రాష్ట్రంలో తతిమా చోట్ల పత్తిరైతులు, మన జిల్లాలో రొయ్యల రైతులు పడుతున్న బాధలు చెరకు రైతులు కూడా అనుభవించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ప్రతి రైతు గుర్తించవల్సిన వాస్తవం ఇది.

మన ఫ్యాక్టరీ అమ్మకం పెట్టవల్సిన దుస్థితిలో ఎంత మాత్రం లేదు. 1974లో నాంది పలికారు దీని ఏర్పాటుకు. 1979 మార్చి నెలలో క్రషింగ్ ప్రారంభించినప్పటి నుంచి రైతాంగం పాలిట కల్పతరువుగా భాసిల్లుతున్నది. కోవూరు, నెల్లూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట తదితర మండలాల రైతాంగం స్థితిగతులలో ఈ రెండు దశాబ్దాలలో ఎంతో మేలు మార్పులు తెచ్చిన ఫ్యాక్టరీ ఇది. వారి పంట సాగుతో నష్టాలు, కష్టాలను పడుతుండిన రైతాంగం ఆర్థిక స్థితిని చెప్పుకోదగ్గ రీతిలో మెరుగు పర్చిన పరిశ్రమ ఇది. మరొక ప్రక్క ఫ్యాక్టరీ కూడా 1000 టన్నుల స్థాయి నుంచి 2500 టన్నుల క్రషింగ్ సామర్థ్యానికి వృద్ధి చెందింది.

తరువాయి 7వ పేజీలో



